# హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలి

**-మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**



ముద్విన్ గ్రామంలో హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

కడ్తాల్, మార్చి 31ః మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం కడ్తాల్ మండల పర్యటనను విజయవంతం చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చరికొండ గ్రామ పంచాయతీలో గల బోయిన్‌గుట్ట తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను, ముద్విన్ గ్రామంలో రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇంటిని ఆయన ప్రారంభించనున్నట్లు జైపాల్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం బోయిన్‌గుట్ట తండా, ముద్విన్ గ్రామంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లను పరిశీలించి ఆయన మట్లాడారు. కడ్తాల్ మండలంలో బుధవారం హరీశ్‌రావు పర్యటించనున్నారని తెలిపారు. బోయిన్‌గుట్ట తండాలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణతోపాటు ముద్విన్ గ్రామంలో నూతన గృహన్ని ఆయన ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం బోయిన్‌గుట్ట తండాలో నిర్వహించే సభలో ఆయన పాల్గొంటారని వివరించారు. నియోజకవర్గం నుండి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు నర్సింహాగౌడ్, యాదయ్య, రవీందర్‌రెడ్డి, హరిచంద్‌నాయక్, జంగయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, రమేశ్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, వెంకటయ్యయాదవ్, నాయకులు రామకృష్ణ, జంగయ్య, శ్రీను, అంజినాయక్, సోమ్లా, బాబుజీ, రాజేశ్, వినోద్, గోపాల్, వెంకటయ్య, రాజు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి జిల్లావ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

రంగారెడ్డి, మార్చి 31 (నమస్తేతెలంగాణ) : నేటినుంచి రంగారెడ్డిజిల్లాలో సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు గోడౌన్ నుంచి ఆయా గ్రామాల్లోని రేషన్‌దుకాణాలకు సన్నబియ్యం చేరుతున్నాయి. మంగళవారం ఉదయం 9గంటలకే ఐపాస్ మిషన్‌ను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. రంగారెడ్డిజిల్లా వ్యాప్తంగా 936 రేషన్‌షాపులున్నాయి. ఇప్పటికే ఈ రేషన్‌షాపుల్లో అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం ఇప్పటికే రంగారెడ్డిజిల్లాలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న 3.50లక్షల మందిలో కొత్తగా 20వేల మందికి రేషన్‌కార్డులను కేటాయించింది. ఈ రేషన్‌కార్డులతో కలిపి మొత్తం జిల్లాలో 5,71,696రేషన్‌కార్డులు ఉన్నాయి. హైదరాబాద్ నగరం చుట్టూ విస్తరించి ఉన్న రంగారెడ్డిజిల్లాలో రాష్ట్రం నలుమూలలకు చెందిన ఎంతోమంది ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. వారికి రేషన్‌కార్డులు లేకపోవటం వలన అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. వీరిలో రంగారెడ్డిజిల్లా ప్రజావాణి గ్రామసభల ద్వారా 1.51లక్షల రేషన్‌కార్డులు, కులగణన సర్వేద్వారా 29,405, మీసేవ, ప్రజావాణి, ప్రజాపాలన కింద సుమారు 75వేల దరఖాస్తులు, అలాగే, మొత్తం కలిపి 98వేల ధరఖాస్తులు వచ్చాయి. ఈ ధరఖాస్తులను అధికారులు క్షుణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను సుమారు 20వేల మందిని గతంలో ఎంపికచేసినట్లు తెలిసింది.

# యువ వికాస పథకంపై అవగాహన పెంచాలి

**రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాన్ఫరెన్స్‌కు హాజరైన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, సంబంధిత శాఖల అధికారులు

వికారాబాద్, మార్చి 31 : రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాజీవ్ యువ వికాసం పథకంపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకే ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఏప్రిల్ 5, 2025 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. 50 వేల రూపాయల లోపు రుణం వంద శాతం మాఫీ, లక్ష రూపాయల లోపు రుణం 90 శాతం మాఫీ, లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ. 2లక్షల రూపాయల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు లోన్ల ద్వారా అందిస్తారన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల లోపు ఉండాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 2 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హులందరూ దరఖాస్తులు చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలన్నింటినీ మున్సిపల్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా శాఖల ద్వారా పలుమార్లు పత్రిక ప్రకటనలు ఇచ్చామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం, డీటీడీవో కమలాకర్ రెడ్డి, డీపీవో జయసుధ, అధికారులు ఉపేందర్, హనుమంతు రావు, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుకు గడువు 14వరకు పొడిగింపు...

**– రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్సరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సి నారాయణ రెడ్డి

ఆదిబట్ల,మార్చి31: రాజీవ్ యువ వికాస పథకం కింద దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 14 వరకు పొడిగించిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు.సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, ఈబీసీ యువత రాజీవ్ యువ వికాస్ పథకానికి మండల ప్రజా పాలన సేవా కేంద్రాలు ,మున్సిపాలిటీ ప్రజాపాలన సేవా కేంద్రాలలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు ఏప్రిల్ 14 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,రాష్ట్ర ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి శాంతికుమారితో నిర్వహించిన రాజీవ్ యువ వికాసం పై వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ జిల్లాకు సంబంధించి పలు విషయాలు వివరించారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాలో రాజీవ్ యువ వికాసం కింద ఇప్పటి వరకు 92వేల 492 దరఖాస్తులు ఆన్‌లైన ద్వారా స్వీకరించామని అన్నారు.కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.ప్రతి మండల మున్సిపల్ ప్రజాపాలన రాజీవ్ యువ వికాసం కేంద్రాలలో మ్యాన్‌వల్ దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, బీతసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు కేశురాం, సంధ్యారాణి, పద్మావతి, రాజేశ్వరిదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసం.. మనశ్శాంతి దూరం

- ఆన్‌లైన్ మాయగాళ్ల వలలో పడి బాధితుల ఇళ్లల్లో కలహాలు
- మానసిక ఒత్తిడితో ఆసుపత్రి పాలు..
- ఫిర్యాదు ఆలస్యమైతే సొమ్ము రికవరీ కష్టమే: పోలీసులు
- వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలి

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో సలహాలిచ్చి రెట్టింపు లాభాలిస్తామంటూ ఆశపెట్టి లక్షల రూపాయల్లో పెట్టుబడులు పెట్టించి చివరకు టోపీ పెట్టేస్తున్నారు. పార్ట్‌టైమ్ జాబ్ ఇస్తామంటూ గూగుల్‌లో అభిప్రాయాలు రాయాలంటూ చార్జీల పేరుతో వసూలు చేసి ఆ తర్వాత చేతులెత్తేసేస్తున్నారు. బంగారం ధర పెరుగుతున్న సమయంలో తక్కువ ధరకే ఇస్తామంటూ నమ్మించి లక్షల్లో మహిళలను దోచేస్తున్నారు. ఇలా ఆన్‌లైన్ మాయగాళ్ల వలలో పడి మోసపోతున్న బాధితుల సంఖ్య హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతోంది. అయితే తమ బాధలు పోలీసులకు చెప్పుకోలేక.. ఇంట్లో బయటపెట్టలేక సతమతమవుతూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఆ తర్వాత దవాఖాన పాలవడమో.. లేక తనువు చాలించడమో జరుగుతోంది. సిటీలో ఈ మధ్యకాలంలో జరిగిన చాలా కేసుల్లో ఇదే పరిస్థితి వెలుగుచూస్తోంది.

**మచ్చుకు కొన్ని కేసులిలా..**

హైదరాబాద్ నగరానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో తనను సంప్రదించిన వ్యక్తిని నమ్మి మోసపోయింది. బంగారం విషయంలో ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయడాన్ని గమనించిన సైబర్‌మోసగాడు ఆమెను సంప్రదించి తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామని, మొదట ఇచ్చినట్లే ఇచ్చి ఆ తర్వాత లక్షలు పెట్టుబడి పెట్టించి ముఖం చాటేయడంతో ఆమె తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మరణించింది.

ఉన్నత హోదాలో రిటైరయిన హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయారు. తనకు ట్రేడింగ్‌లో సలహాలిచ్చి రెట్టింపు లాభాలు వచ్చేలా చేస్తామని, అందుకు టెలిగ్రామ్ గ్రూపులో జాయిన్ చేసి ఆ తర్వాత మొదట లాభాలిచ్చినట్లే ఇచ్చారు. దీంతో అతను రూ.82లక్షలు పెట్టుబడి పెట్టాడు. సైబర్ నేరగాళ్ల నుంచి స్పందన లేకపోవడంతో అతను తీవ్ర ఒత్తిడికి గురై అధిక రక్తపోటుతో వైద్యశాలలో చేరాడు. ఇప్పటికీ అతని డబ్బులు రికవరీ కాలేదు.

ఆన్‌లైన్ టాస్క్ ద్వారా నెలకు రూ.30వేలు సంపాదించి తన భర్తను ఆశ్చర్యపర్చాలనుకుంది ఓ గృహిణి. హైదరాబాద్‌లో ఉన్నత వర్గాలు ఎక్కువగా ఉండే ఓ ప్రాంతానికి చెందిన విద్యావంతురాలైన ఆమె అందినచోటల్లా అప్పులు తెచ్చి చార్జీలు కట్టింది. తన దగ్గరున్న బంగారం కూడా తాకట్టుపెట్టి మరీ డబ్బులు చెల్లించింది. అయితే తీరా సైబర్ కేటుగాళ్లు ఆమెకు చేయివ్వడంతో తన భర్తకు తెలిస్తే గొడవ అవుతుందని భావించి భర్తపైనే వేధిస్తున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తీరా కౌన్సెలింగ్‌లో ఆన్‌లైన్ మోసానికి సంబంధించిన విషయం బయటపడడంతో పోలీసులు ఆశ్చర్యపోయారు. ఇద్దరు భార్యాభర్తలకు సర్దిచెప్పి సైబర్ నేరగాళ్లపై కేసు నమోదు చేసి వారిని ఇంటికి పంపించేశారు.





పార్ట్‌టైమ్ జాబ్‌ల పేరుతో నగరానికి చెందిన ఒక యువకుడు ఆన్‌లైన్ చార్జిలు కట్టాడు. ఫేక్ లెటర్లు, ఐడీ కార్డులు వచ్చిన తర్వాత నమ్మి ఆన్‌లైన్ జాబ్ వచ్చిందంటూ సంబురపడిపోయాడు. మూడు నెలలైనా డబ్బులు రాకపోవడంతో తనకు కాల్ చేసిన వ్యక్తులను సంప్రదించాడు. కానీ వారు స్పందించకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. దీంతో ఇంట్లోవారు పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారి దర్యాప్తులో ఈ తతంగం వెలుగుచూసింది. ఇప్పటివరకు యువకుడి జాడ దొరకలేదని పోలీసులు చెబుతున్నారు.

**వారానికి 10 కేసులు..**

ఆర్థికనేరాలు, సైబర్ మోసాల్లో అధిక శాతం హైదరాబాద్ నగరానికి చెందిన ప్రజలు మోసపోతున్నారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారానికి పదికేసులు ఇలాంటివే నమోదవుతున్నాయి. ఇలాంటి ఫిర్యాదులు వెలుగుచూసినవి తక్కువేనని, పోలీసులకు చెబితే ఏమవుతుందోనని చాలామంది తమ వరకు రావడం లేదంటూ సైబర్ పోలీసులు చెబుతున్నారు. బాధితుల్లో సంపన్నులు, మధ్యతరగతి, విశ్రాంత ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని, ఆకర్షణీయమైన ప్రకటనలు, సైబర్‌నేరగాళ్ల మాయమాటలు నమ్మి తమ పరిధి దాటి పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కేసుల్లో సున్నిత మనస్కులు కఠిన నిర్ణయాలు తీసుకుంటే, మరికొందరు మానసిక ఒత్తిడితో ఆసుపత్రి పాలవుతున్నారు.

**తక్షణమే స్పందించని బాధితులు..**

సైబర్ మోసాల్లో బాధితుల నుంచి తక్షణ స్పందన కరువవుతున్నదని సైబర్ పోలీసులు చెప్పారు. తాము మోసపోయామని గ్రహించిన వెంటనే తమను సంప్రదించకుండా అనవసరంగా ఆలస్యం చేస్తూ మానసిక ప్రశాంతత కోల్పోయి కుటుంబాల్లో కలహాలు పెంచుకుంటున్నారని వారు విశ్లేషించారు. ముఖ్యంగా ఈ కేసుల్లో మహిళలు, విశ్రాంత ఉద్యోగులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని గుర్తించారు. మోసం జరగగానే ఫిర్యాదు చేస్తే నగదు రిఫండ్ సులువవుతుందని, ఆలస్యమైతే రికవరీ చాలా కష్టమవుతుందని చెప్పారు. ఆలస్యం చేయడం వల్ల నిందితులు ఆ సొమ్మంతా వేర్వేరు దేశాల్లో ఉన్న ఖాతాల్లోకి మళ్లిస్తున్నారని, క్రిప్టోగా మారి విదేశాలకు తరలించాక రికవరీ అసాధ్యమని పేర్కొన్నారు. బాధితులు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి కానీ, రూ.లక్షన్నరలోపు నష్టపోతే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, అంతకుమించితే సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

# వెల్‌నెస్ సెంటర్ల మాయాజాలం

- ఖరీదైన మందులు తెప్పించి బయట విక్రయిస్తున్నట్లు ఆరోపణలు
- విధులకురాని ఉద్యోగుల వేతనాలు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఖాతాలో!
- గతేడాదిలో రూ.19.19 కోట్లు ఖర్చు చూపిన వైనం

సిటీబ్యూరో, మార్చి31 (నమస్తే తెలంగాణ):రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు , జర్నలిస్టులకోసం నగదు రహిత ఉచిత వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్లు అక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. పలువురు ఉద్యోగులు వైద్యాన్ని వ్యాపారం చేస్తూ విచ్చలవిడిగా డబ్బులు దండుకుంటున్నారు. వైద్యం కోసం వచ్చినవారికి ఉచిత మందులు అందించేందుకు కోట్లు వెచ్చించి ఫార్మా కంపెనీల వద్ద కొనుగోలు చేస్తున్న మందులు పక్కదారి పడుతున్నాయి. అంతేగాకుండా ఆధారాలు లేకుండా ఉద్యోగం ముసుగులో మటుమాయం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఉద్యోగానికి సెలవు పెట్టిన వారి వేతనాలు సైతం ప్రతినెలా తన ఖాతాలోకి మలుపుకుంటున్న పొరుగుసేవల ఏజెన్సీ నిర్వాకం చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే.

**ఉద్యోగం ముసుగులో మటుమాయం..**

రాష్ట్ర వ్యాప్తంగా 12 వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సుమారు 253 మంది సిబ్బంది పొరుగుసేవల ప్రాతిపదికన పనిచేస్తున్నారు. వైద్యులు, ల్యాబ్ టెక్నిషియన్లు, ఫార్మసిస్టులు, నర్సులు మొదలైన సిబ్బందంతా ఔట్‌సోర్సింగ్ విధానంలో వైద్య సేవలందిస్తున్న వారే కావడం గమనార్హం. ఇన్ని విభాగాల్లో వైద్య సేవలందించేందుకు ఒక్క రెగ్యులర్ వైద్యుడు లేడు. వీటికి తోడు పలు సెంటర్లలో ఓపీలు తక్కువ ఉన్నారన్న సాకుతో హాజరు వేసుకొని ఇంటికి వెళ్లిపోయే వారు కూడా ఉన్నారు. పలువురు పొరుగుసేవల సిబ్బంది గతంలో వివిధ సంస్థల్లో విలేకరులుగా చేసినవారు ఉన్నారు. వారంతా జర్నలిస్టులుగా ఆయా కేంద్రల్లో వైద్యం చేయించుకునేందుకు అర్హులే. అయితే జర్నలిస్టు కార్డులు చూపి కావాల్సిన మందులు ఉచితంగా తీసుకొని బయట ప్రైవేట్ వ్యక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది సహకారంతో ఫార్మసీ ప్రతినిధితులతో తమకు కావాల్సిన మందులు ఇండెంట్ పెట్టి తెప్పించుకోవడం, వాటిని బయట విక్రయించడం పనిగా పెట్టుకున్నారు. ఈ తరహా దారుణాలు జరుగుతున్నా అధికారులు తనిఖీలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కావాలనే అలాంటి సిబ్బందిని వెనకేసుకొస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. 2023–24 ఏడాదిలోనే వెల్‌నెస్ సెంటర్లకు మందులు కొనేందుకు రూ.19.19 కోట్లు ఖర్చు అయినట్లు లెక్కలు చూపించడం గమనార్హం.

**విధులకు రాకున్నా వేతనాలా?**

రాష్ట్ర వ్యాప్తంగా వెల్‌నెస్ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాల వల్ల విధులకు రాకుండా నెలల తరబడి సెలవులో ఉన్నవారి వేతనాలు వారి ఖాతాల్లోకి జమచేస్తూ.. తిరిగి పొరుగుసేవల ఏజెన్సీ ఆ సొమ్మును తన ఖాతాలోకి మళ్లించుకొంటున్నారు. దీంతో ప్రభుత్వ సొమ్ముకు గండి పడుతోంది. ఈ తరహా మోసాలపై చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇదిలా ఉండగా రోగులపై సిబ్బంది నిర్లక్ష్యం చెప్పాల్సిన అవసరమే లేదు.

**అవినీతిమయం**



వెల్‌నెస్ సెంటర్లలో ఉద్యోగుల నియామకాలు, మందుల కొనుగోళ్ల తీరు మొత్తం అయోమయంగా కొనసాగుతుంది. గ్రేటర్ పరిధిలో ఉన్న సెంటర్లలో అధికారుల పర్యవేక్షణ కరవైంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ చేపట్టాలి. అవినీతి జరుతున్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్, సీపీఎం గ్రేటర్ సెంట్రల్ సిటీ కార్యదర్శి



విద్యార్థినులను కొడుతున్న ప్రిన్సిపాల్ సాయిలత

# విద్యార్థినులను బూతులు తిడుతూ.. కొడుతూ..

**బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వైఖరి వైరల్**

వికారాబాద్, మార్చి 31 : వికారాబాద్ కొత్తగడి గురుకుల బాలికల పాఠశాలలో ఫిబ్రవరి 24న టీచర్ అవమాన పర్చడంతో 10వ తరగతి విద్యార్థినీ పాఠశాల మొదటి అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మరువక ముందే మరో ఘటన వెలుగు చూసింది. విద్యార్థినులను ప్రిన్సిపల్ బూతులు తిడుతూ కొట్టిన అవమాన పరిచిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ సాయిలత ముగ్గురు విద్యార్థినులను బూతులు తిడుతూ కొట్టింది. విద్యార్థినుల మనస్సు గాయపరిచే విధంగా అనరాని మాట్లాడుతూ దుర్భాషలాడుతూ వేధించింది. దారుణంగా చెంపదెబ్బలు కొడుతూ ప్రిన్సిపల్ హింసించింది. విద్యార్థిని తల్లిని కూడా బూతులు తిట్టడంతో... అలా అనవద్దని వేడుకుంటే.. ఎందుకు అనకూడదని రెట్టించింది. మీరు కూలి పనులు చేసుకునన్నా బతుకుతారు... అని అవమాన పరిచింది. మేము ఉద్యోగాలు చేసుకునే వాళ్ళం.. ఉద్యోగాలు చేసుకునే బతకాలి కదా.. అంటూ విద్యార్థులను హేళన చేస్తూ ప్రిన్సిపల్ తిట్టడంతో విద్యార్థినులు మనోవేదనకు గురయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇలా ఆ గురుకుల పాఠశాలలో విద్యార్థినులను ఎంత ఇబ్బందులకు గురి చేస్తున్నారో అనే తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రిన్సిపల్ సాయితలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ తదితరులు

# ప్రభుత్వం ఉద్యోగులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

కాచిగూడ, మార్చి 31: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాలపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే శ్వేత పత్రాన్ని విడుదల చేసి నిజాయితీని నిరూపించుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. అనంతరం చదర్ ఘాట్ సర్కిల్లో రాష్ట్ర నాయకులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి గాల్లోకి వదిలిపెట్టడంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని ఆయన మండిపడ్డారు. విద్యార్థుల స్కాలర్ షిప్‌లను రూ.20 వేల వరకు పెంచాలని, విద్యార్థులకు ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, ముత్యాలరావు, ప్రశాంత్ నిమ్కర్, సత్యపాల్ సింగ్, భాస్కర్, ప్రదీప్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మాకు రైతు భరోసా ఇవ్వరా?

- ఔటర్ రింగు రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాల రైతుల ఆవేదన
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు రైతు భరోసా ఇచ్చింది రూ. 6 కోట్లే
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు రూ. 33 కోట్లు

మేడ్చల్, మార్చి31(నమస్తే తెలంగాణ): మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల రైతులకు ఇప్పటి వరకు రైతు భరోసా అందలేదు. వ్యవసాయం సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాలలో రైతులు లేరా తమకు ఎందుకు రైతు భరోసా ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. రైతు భరోసా పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.6 కోట్లు మాత్రమే రైతు భరోసా ద్వారానే రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధును రూ. 33 కోట్లు జమ చేశారని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. రైతులకు ఇచ్చిన ఏ కొక హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని రైతుల బతుకులను ఆగం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రైతు భరోసా ఇచ్చేందుకు గుర్తించిందే తక్కువ ఎకరాలు**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో రైతు భరోసా ఇచ్చేందుకు గుర్తించింది 14,300 ఎకరాలకే ఇందులో అందరికి రైతు భరోసా అందలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాసంగిలో ఎకంగా 64, 700 ఎకరాలకు రైతు భరోసాను అధికారులు కట్ చేశారు.

**రైతులందరికి రైతు భరోసాను అందించాలి**



యాసంగిలో వ్యవసాయం సాగు చేసిన రైతులందరికీ రైతు భరోసాను అందించాలి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఔటర్ రింగ్ రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాల రైతులకు ఏ ఒక్కరికి కూడ రైతు భరోసా అందలేదు. ఔటర్ రింగురోడ్డుకు అనుకుని గ్రామాలలో వ్యవసాయం సాగు చేసేవారు రైతులు కాదా. యాసంగిలో అనేక మంది రైతులకు రైతు భరోసా కట్ చేయడం సరైందికాదన్నారు. కష్టపడి వ్యవసాయం సాగు చేసే రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు.

– మధుకర్‌రెడ్డి, శామీర్‌పేట్ సొసైటీ చైర్మన్

# సీతారాముల కల్యాణానికి శ్రీరామ నామ తలంబ్రాలు

కొండాపూర్, మార్చి 31 : శ్రీరాముని పై ఉన్న భక్తిని వినూత్న రీతిలో వ్యక్తం చేసింది ఓ భక్తురాలు. చందానగర్ సురక్ష ఎంక్లేవ్ లో నివాసముండే విష్ణు వందన శ్రీ రాముని పై భక్తిని చాటుతూ 2016 నుంచి బియ్యం గింజల పై రామ నామం లిఖిస్తూ వాటిని రాములోరి కళ్యాణంలో తలంబ్రాలుగా పలు ఆలయాలకు అందజేస్తుంది. తన భక్తిని చాటుతూ నేటి వరకు 10,75000ల బియ్యపు గింజలపై రామ నామాన్ని లిఖించినట్లు తెలిపింది. కాగా ఈ సంవత్సరంలో 1,75000ల గింజలపై రామ నామాన్ని రాసి 60 ఆలయాలకు చేరవేసినట్లు తెలిపింది. తలంబ్రాలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రా ల్లోని ఆలయాల్లో ఏప్రిల్ 6న జరగనున్న సీతారాముల కళ్యాణ మహోత్సవంలో వాడు తుండడం సంతోషంగా ఉందన్నారు.





రామ నామం లికించిన తలంబ్రాలు .. బియ్యం గింజల పై రామనామం రాస్తున్న భక్తురాలు విష్ణు వందన

# ఘనంగా సాహిత్య పురస్కారాల ప్రదానం

రవీంద్రభారతి, మార్చి31 తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో డాక్టర్ కపిలవాయి లింగమూర్తి 97వ జయంతి సందర్భంగా పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఆచార్య సాగి కమలాకరశర్మ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, డా.నామోజు బాలాచారి, గున్న రాజేందర్‌రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పురగ్రహితలు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, డా.కొల్లోజు కనకాచారి, వనపట్ల సుబ్బయ్య, వల్లభాపురం జనార్ధన్ సాహిత్య పురస్కారాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కపిలవాయి అశోక్‌బాబు, డా.కె.కృష్ణమూర్తి, దిలీపాచారి తదితరులు పాల్గొన్నారు.